క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ గ్రామాలు, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణ చేయవచ్చని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు.

మరోసారి అవకాశం కల్పించాలి



భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్సీగా తనకు మరోసారి అవకాశం కల్పించాలి యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. వరంగల్–నల్గొండ–ఖమ్మం ఉపాధ్యాయు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నర్సిరెడ్డి బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి(ఎస్‌ఎం), పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి ఉపాధ్యాయ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతి, రమేష్, రంజిత్, సమ్మారావుచ, రమ, రాజేందర్, రామయ్య, కన్నయ్యలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన దండ్రె మహాలక్ష్మి అనే బాలిక అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పరామర్శించి, ఆమె ఆరోగ్యంపై డాక్టర్లతో మాట్లాడారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించారు. ఆయన వెంట వెల్లంపల్లి మాజీ ఉప సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి ఉన్నారు.

పరామర్శ



కాళేశ్వరం: మహదేవపూర్, బొమ్మాపూర్, అంబట్‌పల్లి గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ బుధవారం పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, అన్కారి ప్రకాశ్, సల్మాన్ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని చెంచుపల్లి గ్రామంలోని పలువురి చెంచు కుటుంబాలకు బుధవారం ఎస్సై సందీప్ కుమార్ బియ్యం అందజేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కోడిపందేలా స్థావరంపై పోలీసుల దాడి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం రాపల్లికోట గ్రామశివారులో కోడి పందేలా స్థావరంపై ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో కోడిపందేరాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కాగా, నలుగురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకొని వారి వద్ద రూ.2,510 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గోవిందరావుపేట: రక్తదానం ప్రాణదానంతో సమానం అని బెటాలియన్ కమాండెంట్ అలెక్స్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చల్వాయి పరిధి ఐదవ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని కమాండెంట్ అలెక్స్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 50 మంది పోలీసులు రక్తదానం చేశారని అన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ములుగు ఏరియా ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల చూపు.. యంత్రాల వైపు

- ప్రతీ గ్రామంలో వరికోత మిషన్లు
- సులభంగా, వేగంగా పనులు



జగ్గయ్యపేటలో వరి కోస్తున్న హార్వెస్టర్

రేగొండ: మండలంలో కూలీల కొరత నెలకొన్న తరుణంలో అన్నదాతలు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో వరికోత యంత్రాలు ఎక్కడో ఒక దగ్గర కనిపించేవి ప్రస్తుతం ప్రతీ గ్రామంలో రైతులు ఈ యంత్రాల ద్వారానే పనులు చేయిస్తున్నారు. వరికోత యంత్రాలు కూలీలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నాయని చెబుతున్నారు. ఖర్చులు కాస్త ఎక్కువైనా పనులు వేగంగా, సులభంగా అవుతున్నాయని తెలుపుతున్నారు. మండలంలో యంత్రాల సాయంతో ప్రతీ రోజు వందల ఎకరాలలో వరి కోతలు కోయిస్తున్నారు. వరికోత యంత్రాల యజమానులు గంటకు రూ.2500 నుంచి రూ.3000 వరకు తీసుకుంటున్నారు. రైతులకు బ్యాంకు రుణాలు ఇస్తుండటంతో చాలా మంది రైతులు హార్వెస్టర్ తెచ్చుకుని ఉపాధి పొందుతోన్నారు. గతంలో రైతులు వరి కోయడం, బంతి చేయడం, తూర్పార పట్టడం వంటి పనులు చేస్తూ ఐదు నుంచి ఆరు రోజులు సమయాన్ని వెచ్చించే వారు. ప్రస్తుతం యంత్రాలు రావడంతో ఒకే రోజు ధాన్యం ఇంటికి చేరుతోంది.

పనులు సులభం



కూలీలు దొరకడం లేదు. అందుకే వరికోత యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నాం. ఖర్చు ఎక్కువైనా పనులు సులభంగా అవుతున్నాయి. ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవచ్చు.

– పాడిశెట్టి రాములు, రైతు, కొత్తపల్లిగోరి

కూలీల కొరతకు చెక్



వరికోత యంత్రాల రాకతో పని సులువై కూలీల కొరత తీరినట్లు అనిపిస్తోంది. పశుగ్రాసం మాత్రం నష్టపోతున్నాం. భవిష్యత్‌లో వ్యవసాయ పనులు మొత్తం యంత్రాల వినియోగంపైనే రైతులు ఆధారపడే పరిస్థితులు ఉన్నాయి.

– కొడగాని రాకేష్, రైతు, పెద్దంపల్లి

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న శంకరయ్య

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంలోని ఎమ్మార్సీలో మండల విద్యాధికారి డి.శంకరయ్య వివిధ పాఠశాలలకు రెండో విడత ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి మాట్లాడుతూ.. విద్యా సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను తయారు చేయబడినట్లు తెలిపారు. పిల్లల్లో చదవడం, రాయడం అవగాహన చేసుకోవడం లాంటి నైపుణ్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని కోరారు. అలాగే పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యా సంవత్సరానికి ముందుగానే పాఠశాలలకు అందే విధంగా చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడురాజిరెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు కల్యాణి, సరావత్ సుల్తానా, ఉపాధ్యాయులు సారంగపాణి, శరత్, రాజుకుమార్, సాంబయ్య, మండల వనరుల కేంద్రము సిబ్బంది స్వాతి, మహేష్,రాజు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో దీపావళి వేడుకలు



దీపావళి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ పాఠశాలలో బుధవారం దీపావళి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో లక్ష్మీదేవి పూజ చేసి విద్యార్థులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నరకాసుర వధ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురేష్ మాట్లాడుతూ.. దీపావళి అంటే దీపాల వరుస అని చీకటిని పారద్రోలి అజ్ఞాన అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రకాశింపజేయడమని తెలిపారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: పేదల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపనున్న రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ఆపడంలో విజయం సాధించిన సందర్భంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలను ఇబ్బందులకు గురి చేసేందుకే ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండగా ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, ప్రస్తుత ప్రభుత్వం పది నెలల్లోనే పేదలపై భారం మోపేందుకు ప్రయత్నించిందన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకను విని విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించడం మొదటిసారి అన్నారు. భూపాలపల్లిలో తాను పేదలకు మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వేరే వ్యక్తులకు ఇవ్వాలని చూస్తున్నారని, అదే గనుక జరిగితే ఆందోళనలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



టేకుమట్ల: అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేకుమట్ల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. మండలంలోని సుబ్బక్కపల్లిలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలను ఎవరైనా కులం పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. కులాల పేరుతో ఎవరిని చులకన భావంతో ప్రవర్తించరాదని, సమాజంలో మానవులందరూ సమానమే అని తెలిపారు. కులమతాలకతీతంగా కలిసి మెలసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోష్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

చిట్యాల: రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎవరూ భంగం కలిగించొద్దని తహసీల్దార్ నల్లబెల్లి హేమ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపేట దళిత కాలనీలో హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దళితులపై దాడులు చేసినా, కులం పేరుతో దూషించినా చర్యలు ఉంటాయని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, గ్రామస్తులు ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బెగుళూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల సంబంధించిన చట్టాలు, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ కృష్ణ, ఎంపీఓ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా జీవించాలి

మొగుళ్లపల్లి: కులాలలకు, మతాలకు అతీతంగా ప్రజలు జీవించాలని తహసీల్దార్ సునీత సూచించారు. బుధవారం మండలంలోని పర్లపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీత, ఎంపీడీఓ మహబూబ్‌హుస్సేన్, ఎఎస్సై రత్నం, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చిట్యాల: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ హేమ



కాళేశ్వరం: మాట్లాడుతున్న తహసీల్దార్



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

సమస్యలకు నిలయంగా యూఆర్‌ఎస్



మాట్లాడుతున్న జోసెఫ్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ (యూఆర్‌ఎస్) సమస్యలకు నిలయంగా మరిందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసెఫ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని యూఆర్‌ఎస్ పాఠశాలను బుధవారం సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. అద్దె భవనంలో ఉంటున్న యూఆర్‌ఎస్ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గదులకు తలుపులు, కిటికీలు లేవని మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని వాపోయారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, పవన్, సాకేత్‌రెడ్డి, సర్వాప పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు

టేకుమట్ల: వానాకాలం సీజన్‌లో వేసిన వరి పంటలు ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగు వంతెనపై రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. కాగా బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ధర ఎలా వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉదయం, సాయంత్రం సుమారు నాలుగు గంటల పాటు వర్షం కురవడంతో వరి, పత్తి చేలలోకి నీరు చేరింది. అకస్మాత్తుగా కురిసిన వర్షం వరి, పత్తిరైతులకు తీరని నష్టం చేకూర్చింది. పంట పొలాలు కోతకు రావడంతో వర్షం కారణంగా పంట పొలాలు కొంత మేర దెబ్బతిన్నాయి. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చే సమయానికి వర్షం నిండా ముంచిందని రైతులు వాపోతున్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రేగొండ: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ రాంప్రసాద్‌లకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి, ఓపీఎస్‌లుగా పని చేస్తున్న వారిని పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరణ చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు, నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రారెడ్డి, కుమారస్వామి, తిరుపతి, శ్రీకాంత్, మమత, పద్మ, జ్యోతి, అమూల్య, జీవిత పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల రిమాండ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలానికి చెందిన ఓ బాలికను మాయమాటలు చెప్పి తీసుకువెళ్లిన ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 7న మండలానికి చెందిన 17 సంవత్సరాల బాలిక భూపాలపల్లిలోని హాస్టల్‌కు వెళ్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. హాస్టల్ సిబ్బంది ఈనెల 11న ఇంటికి ఫోన్ చేసి మీ కుమార్తె హాస్టల్‌కు రాలేదని చెప్పారు. దీంతో కంగారుపడిన బాలిక తల్లి అదే రోజున మహదేవపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా,మంగళవారం రాత్రి మహదేవపూర్ బస్టాండ్ వద్ద ఆ బాలిక వేరే వ్యక్తితో కనిపించడంతో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తీసుకువచ్చి, మహిళా కానిస్టేబుల్‌తో రికార్డు చేయించి బాలిక తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ వ్యక్తిని విచారించగా పలిమెల మండలానికి చెందిన లింగి రాజశేఖర్ బాలిక చదివే కాలేజీలో పరిచయం చేసుకొని, ప్రేమిస్తున్నాని మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని, లేదంటే చనిపోతానని బెదిరించి ఇంటి నుంచి తీసుకువెళ్లినట్లు ఒప్పుకున్నాడు. లెంకలగడ్డకు చెందిన తన మిత్రుడు మడప బాపు తనకు సహకరించినట్లు తెలిపాడు. ఆ బాలిక, రాజశేఖర్ దేవాలయాలు తిరిగి, సత్రాల్లో తింటూ ఇన్ని రోజులు గడిపారని తెలిపారు. బాలికను తీసుకువెళ్లినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్‌ను రిమాండ్

మొగుళ్లపల్లి: అమ్మాయి నీ మోసం చేసిన కేసులో ఆర్మీజవాన్‌ను రిమాండ్ పంపినట్లు సీఐ మల్లేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన నీరటి రణధీర్ ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా జమ్మూ కాశ్మీర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిట్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని 3 సంవత్సరాలుగా నమ్మించి శారీరకంగా వాడుకుని మోసం చేసిన కేసులో సదరు వ్యక్తిని కోర్టుకు పంపి రిమాండ్ చేసినట్లు సీఐ మల్లేష్ తెలిపారు. సీఐ వెంట ఎస్సై అశోక్ ఉన్నారు.

సామాజిక ఆర్థిక సర్వేపై శిక్షణ



మల్హర్: శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ శివకృష్ణ



కాటారం: మాట్లాడుతున్న అధికారులు

మల్హర్: మండలంలోని కొయ్యూర్ రైతు వేదికలో సామజిక ఆర్థిక సర్వే 2024పై ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు మాస్టర్ ట్రైనర్(ఏఎస్‌ఓ) శివకృష్ణ బుధవారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ ఎన్యూమరేటర్లు మార్గదర్శకాలను అనుసరించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే పక్కాగా చేయాలని, ఏ ఒక్క విషయం తప్పి పోకుండా అన్ని వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కాటారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సామాజిక ఆర్థిక సర్వేను గ్రామాల్లో పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం సామాజిక ఆర్థిక సర్వేపై సర్వే ఎన్యుమరేటర్లుగా ఎంపికైన పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలకు, ఎఫ్‌ఏలు, టీఏ, ఐకేపీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే చేయు విధానం, సర్వేలో సేకరించి నమోదు చేయాల్సిన వివరాలు, బ్లాక్‌ల వారిగా పర్యావేక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, శిక్షకులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

టీపీయూఎస్ మండల కమిటీ ఎన్నిక



శ్రీనివాస్, అధ్యక్షుడు



రమేశ్
ప్రధాన కార్యదర్శి

టేకుమట్ల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) నూతన మండల కమిటీని బుధవారం జిల్లా నాయకుడు గంపల స్వామి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా కుడికాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బండారి రమేశ్, గౌరవ అధ్యక్షులుగా శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా గందం శ్రీనివాస్, శేశాల మల్లయ్య, కోశాధికారిగా తంగెళ్ల రమేశ్, కార్యదర్శులుగా ఆకినపల్లి రాజు, ములకనూరి రాజయ్య, వేముల శ్రీధర్, మహిళా కార్యదర్శిగా శ్వేతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కట్కూరి బాపురెడ్డి, దొనికెల రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి బాలుడి అప్పగింత



తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో గుర్తు తెలియని బాలుడు తిరుగుతుండగా అనుమానం వచ్చి మంగళపల్లి శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా, పోలీసులు బాలుడిని వివరాలు అడగగా పేరు మాటూరి అక్షిత్ కుమార్ తండ్రి విజయ్(చనిపోయాడు) తన వయస్సు 11 సంవత్సరాలు గ్రామం కొలనూరు, మండలం ఓదెల, జిల్లా పెద్దపెల్లి అని తెలిపాడు. అలాగే జమ్మికుంట మండలంలోని విద్యోదయ హైస్కూల్ లో చదువుకుంటున్నానని హాస్టల్ నుంచి తప్పించుకోని వచ్చానని తెలిపాడు. దీంతో ఎఎస్‌ఐ రత్నం బాలుడి తల్లికి సమాచారం అందించడంతో ఆమె వచ్చి తీసుకెళ్లింది.